


# ఊదారంగు మిట్ట మధ్యాహ్నం

ఎమ్మెస్. సూర్యనారాయణ

**కథ**

***ఎంతకీ పూర్తికాని కలలో...స్లోమోషన్ ఎఫెక్ట్‌లో ఒక దృశ్యం... ఊదారంగులో వెంటాడుతోంది!***

**చుట్టూ కొండల్లా నిలబడిన ప్రహారీ గోడల మధ్య సువిశాలమైన సామ్రాజ్యంలా విస్తరించిన పురాతన పెంకుటిల్లు... పదడుగుల ఎత్తుండే పెద్ద అరుగులు... మోకాలెత్తు మెట్లు... మైదానంలా పరుచుకున్న సిమ్మెంట్ కారిడార్... పైన ఆస్‌బెస్టాస్ రేకుల షెల్టరు... పెద్ద దేవిడీ!**

వందలకొద్దీ జనం చేరుకుంటున్నారు అక్కడికి... అలా చేరిన, చేరుతూన్న, చేరబోతూన్న వందలాది, వేలాదిలో నేను వొఖ్ఖణ్ణీ!

సమూహంలో ఏకాకిని!

వాళ్ళంతా 'అతని కోసం' నిరీక్షిస్తున్నారు. నేను కూడా వాళ్ళతో కలిశాను. అయితే- అతనెవరో నేనెరగను! అతనికోసం నేనెందుకు ఎదురుచూడాలో ఆ వివరాలు తెలియవు. అసలక్కడ నేనెందుకున్నానో తెలీదు!

స్లోమోషన్‌లో ఇదే దృశ్యం...

ఊదారంగులో వెంటాడుతోంది...

రాత్రి తెల్లార్లూ గ్రామదేవత సంబరాల్లో జాగారంచేసి... నిద్రపోయి...మళ్ళా మామూలుగా పొద్దుటే లేచి, ముఖం కడుక్కుని, కాఫీ తాగి బరువుగా మళ్ళీ పడుక్కున్నాక- హఠాత్తుగా మొదలై ఉంటుంది.

ఊదారంగు కల! మెల్లగా అది రిపీటవుతూనే ఉంది...

ఉన్నట్టుండి ఫోన్ మోగింది.

ఫోన్ మోత కలలోనా? మెలకువలోనా?

బహుశా మేలుకోవడానికే కాబోలు...

అసంకల్పిత ప్రతీకార చర్యలా రిసీవర్ అందుకున్నాను.

"ఏం చేస్తున్నారూ?" అవతల్నుంచి అక్కిరాజుగారి కంఠం.

"ఏమీ... లేదు...చె...ప్పం...డి" అన్నా మత్తుగా.

"ఒక చోటుకెళ్ళాలి... తోడు రండి... కారు రెడీగా ఉంది" అక్కిరాజుగారి హుకూం.

ఎక్కడికీ అనే ప్రశ్న ఎక్కడైనా ఉంటుందేమో కానీ అక్కిరాజుగారి దగ్గరుండదు!

'సరే...' అని ఫోన్ పెట్టేశాను.

నిద్రకీ, మెలకువకీ మధ్య పెరట్లోకి అడుగులేశాను.

రోహిణీకార్తెలో, మిట్టమధ్యాహ్నపు వేళ...

మత్తులోంచి మెలకువలోకి రావడం కోసం...

మా నూతిలోంచి నాలుగు బకెట్ల కలని తోడిపోసుకున్నాను. చల్లటి నీళ్ళకి బదులు... నూతి రాతి పొరల అడుగున నిశ్చలంగా... నిర్మోహంగా...నిర్గుణంగా... దాగున్న కలని స్నానం చేశాను.

దేహంమీంచి జారి...కల ఆత్మలో యింకుతోంది. ఒక కలలోంచి మేలుకుని, ఇంకో కలలోకి నడిచినట్టు కలలో మెలకువలా, అనాలోచితంగా బయలుదేరాను.

నా కోసం ఎదురు చూస్తున్నారు అక్కిరాజుగారు.

'కారెక్కండి' ఆజ్ఞాపించాధాయన.

మిట్టమధ్యాహ్నం... ఒక ఊదారంగు కల నన్నావహించింది. రిమోట్ సాయంతో ఎవరో నన్ను ఆ కలలో ప్రవేశపెట్టారు!

మరి దీని సారాంశం ఏమిటీ?

నిద్రకీ, మెలకువకీ మధ్య

ఆవిష్కారం ఏమిటీ?

తెలీడం లేదు. అసలు కలకో సారాంశం, దత్తాంశం ఉంటాయా? కల... దానిష్టం!

ఉన్నట్టుండి వెన్నులోంచి చలి మొదలయ్యింది. వెన్నులోంచి పుట్టే చలిభయం... కలలోనా? జీవితంలోనా? కలలో పుట్టే ఫీలింగ్ మెలకువలోకి ఎలా చేరుతుంది?

ఇంతకీ... ఊదారంగు మిట్టమధ్యాహ్నపు కలలాంటి సమయం ఎక్కడికి చేరుస్తుంది?

కారు ఒకచోట ఆగింది.

కార్లోంచి దిగాక వెన్నులో చలి మాయమయ్యింది! వేడిగాలి వొళ్ళంతా పాకింది.

అక్కిరాజుగారి వెనకే అడుగులేయడం మొదలెట్టాను.

ఎదురుగా కనిపించిన దృశ్యాలు నాకు బాగా పరిచయమైనట్టుగా ఉన్నాయి.

వీటిని ఇలాగే...ఎక్కడో చూశాను! ఎక్కడ చూశాను? అన్నీ తెలిసిన పరిసరాలే...

ఎన్నడూ చూడని ఒక ఊరిలో ఎంతో బాగా ఎరిగిన చోటు! ఎలా సాధ్యం?!

హఠాత్తుగా గుర్తుకొచ్చింది.

ఇది స్లోమోషన్‌లో నన్ను వెంటాడుతున్న కల!

చాలాసేపటిక్రితం డిస్‌కనెక్టయిన కల...నిజంగా మళ్ళీ మొదలయ్యింది!

అదే విశాలమైన దేవిడీ... వందలకొద్దీ చేరుకుంటున్న జనం... తేనెపట్టులా పట్టిన జనం!

ఇంతక్రితందాకా వేధించిన ఒకానొక స్వప్నస్థితి పచ్చిగా జీవితంలోకి చొరబడి పోయినట్టుంది! స్వప్నానికీ సత్యానికీ తేడా లేనట్టుంది.

అసలంతమంది అక్కడికి ఎందుకు చేరిన ట్టూ? కలని కట్టుకుని, కలనితిని, తాగి, కల ని మాట్లాడి కలని కల దిరుగుతున్నట్టున్న కలవరపాటులో ఏమరుపాటుగా వాళ్ళతోపా టు నేనూ...

'అతని కోసం' నిరీక్షణ!

ఎవరతను?

ఎంతకీ పూర్తికాని కలలో రిపీట్ అయ్యే సన్నివేశాల్లాగా... స్లోమోషన్ అడుగుల్లాగా... రణగొణ ధ్వని మాటలమధ్య... అసంకల్పి తంగా...

అతనికోసం ఎదురుచూడటం దేనికీ?

నిద్రాకాని, మెలకువా కాని, స్వప్నమూ కాని, సత్యమూ కాని ఉదారంగు నిరీక్షణ ఫలితం ఏమిటి?

'అతను' ఇట్నించి వస్తాడో, అట్నుంచి వస్తా డో, అసలు వస్తాడో రాడో, అనుకునేలాంటి ఎదురుచూపు కాదు!

అతను ఒకచోట నుంచి బయలుదేరాడు...

ఈ చోటుకి వస్తాడు...

ధూంధాంగా వస్తాడు! వందిమాగధులతో వస్తాడు! ఇలా అని కర్ణపిశాచులు సెల్స్‌లో ఘోషిస్తున్నాయి... నిమిష నిమిషానికీ 'అతని అడుగుల చప్పుడు' కర్ణపుటాల్ని మారుమోగి స్తోంది!

ప్లాస్టిక్ గ్లాసుల్లో పంపిణీ చేస్తున్న ఐస్ వాటర్ నిమిషాల్లో ఆవిరైపోతోంది.

మాటలు... మంద్రంగా... భీకరంగా... మౌనంగా... ఆదుర్దాగా...తడితడిగా... పొడి పొడిగా...విజృంభిస్తున్నాయి.

తేనెటీగలు ఝుమ్ మన్నట్టు...

ముసురుకుంటున్న మనుషుల హావభావా లు... కలగాపులగమై... బయటపడుతున్న ఊక!

ఉబుసుపోక ఉబ్బరంగా ఉక్కపెడుతున్న ఊక!

ఐస్ గడ్డ కరిగిపోకుం డా... మాటల ఊక!

అంతటి రణగొణధ్వని లోనూ ఒక గడ్డకట్టిన శ్మశాన నిశ్శబ్దం దాగుంది. లాంచీ ప్రయాణంలో పొగగొట్టం పక్కన కూర్చు న్నప్పుడు... చెవులు హోరెత్తుతాయి.

ఊక వొదిలే గొట్టాం కర్ణపుటాల్ని నుజ్జు చేస్తుం ది. కానీ లాంచీ వొడ్డుకు చేరేముందు...అంతదాకా పొగగొట్టపు ధ్వనిలో దాం కున్న నిశ్శబ్దం...

ఒక్కసారిగా వొడ్డుని ఆవరిస్తుంది!

సరిగ్గా అట్లాంటి నిశ్శబ్ద మే అక్కడ చేరిన వందలా దిలో ఆవరించి, పొంచి ఉంది కాబోలు!

> **జీవితంలో కానీ...కలలో కానీ... ఎన్నడూ, ఎప్పుడూ, ఎక్కడా, ఎలాగా కనీవినీ ఎరగని 'అతని' గురించి మాత్రమే కాదు 'అతని శవం' గురించి సైతం సుదీర్ఘ రోహిణీకార్తె నిరీక్షణ ముగిసింది! ఎంతకీ పూర్తికాని కల- నిజమైన స్లోమోషన్ ఎఫెక్ట్ రుచి చూపించి మరీ అతన్ని రప్పించింది!**

ఈ సమూహంలో నేను ఒంటరిని...

ఒక సామూహిక ఎదురుచూపులో నన్నె వరు బంధించారూ?

అతనెవరు? నేనెవరు?

ఎప్పుడూ ఎక్కడా ఎలాగా తెలియని 'అత ను' వస్తుంటే నాకెందుకూ? అతన్ని తెస్తుంటే నాకెందుకూ?

అతని రాక నాకేల?

కర్ణపిశాచి అరుస్తోంది...

'అతను' నదిని దాటాడు!

పొలాలు దాటాడు... వంతెనలు దాటాడు...

ఘడియో... క్షణమో... ప్రయాణం ముగు స్తుంది! ఎదురుచూపు ముగుస్తుంది!

ఉన్నట్టుండి... నాలో ఉత్సుకత మొదల య్యింది. నేను ఎదురుచూపులో భాగం అయి పోయాను! నిమిష నిమిషం కర్ణపిశాచులు అరుస్తున్నాయి...


నాలో ఆత్రం...

ఇక్కడికి అతను రావడానికి ఎంత సమ యం పడుతుందీ?

"ఘడియో... క్షణమో!"

నాలో కంగారు... అతనెలా ఉంటాడూ?

బహుశా ఎత్తరిగా.. ఎర్రగా... ఆజానుబా హువా? లేక నల్లగా...పొట్టిగా...గుమ్మటం లాగానా! లేక పీలగా...ఎక్కినరంలా...?



ఆలోచిస్తున్నాను.

జీవితం ఏ లిప్తలోనూ ఎరగని అపరిచితుడి ఆగమనంలో భాగమై...నిరీక్షిస్తున్నాను.

తేనెటీగల పట్టులా జనం.

మాట్లాడుకుంటున్నారు... నవ్వుకుంటున్నా రు...కళ్ళు నులుముకుంటున్నారు... కరచాల నాలు...నమస్కారాలు...అర్ధనమస్కారాలు... రకరకాల ధ్వనులు...లాంచీ పొగగొట్టం దగ్గర కూర్చున్న ఫీలింగ్.

కాలం లాంచీ అతని వొడ్డుకు చేరాలి.

అప్పుడు... అతన్లో దాంకున్న నిశ్శబ్దం బయటపడాలి. హఠాత్ నిశ్శబ్దం... హఠాత్ శూన్యం... హఠాత్ వైరాగ్యం... హఠాత్ దుఃఖం... హఠాత్....

అంతా హఠాత్‌గా మారుతుంది!

కర్ణపిశాచి అరిచింది...

అతను వీధి మొగలో ఉన్నాడు...

టౌట్లు పేలాయి... నినాదాలు లేచాయి... జువ్వలు ఎగిరాయి...

అరణ్యాలనీ... సముద్రాల్నీ... నదుల్నీ... పంటపొలాల్నీ...బంజరు భూముల్నీ... వంతె నల్నీ... అవరోధాల్నీ... అధిగమించి అక్క ణ్ణుంచి ఇక్కడికి చేరుకున్న అతను-

నా ఉదారంగు అసంకల్పిత అసంబద్ధ నిరీక్షణ! అతను... అపరిచిత శవకళ!

జీవితంలో కానీ...కలలో కానీ...ఎన్నడూ, ఎప్పుడూ, ఎక్కడా, ఎలాగా కనీవినీ ఎరగని 'అతని' గురించి మాత్రమే కాదు

'అతని శవం' గురించి సైతం

సుదీర్ఘ రోహిణీకార్తె నిరీక్షణ ముగిసింది! ఎంతకీ పూర్తికాని కల- నిజమైన స్లోమోషన్ ఎఫెక్ట్ రుచి చూపించి మరీ అతన్ని రప్పిం చింది!

అతనొచ్చాడు-

ధూంధాంగా... ఠీవిగా... ఎనిమిదికాళ్ళ రథం పైనెక్కి...

అతనొచ్చేశాడు!

లాంచీ వొడ్డుకు చేరింది...

మాటల పొగగొట్టం ఆగింది....

భయంకర నిశ్శబ్దం... శ్మశాన నిశ్శబ్దం...

అతని అపరిచిత శవ స్వరూ పం కోసం ఎత్తు అరుగు మీద ఆత్రంగా నిలబడ్డాను...

తాగి పారేసిన డిస్పోజబుల్ గ్లాసుల కుప్పల్లోంచి నిశ్శబ్దంగా చప్పుడు చేస్తూ...

అతను... నా ముందు నుంచీ రహస్యంగా వెళ్ళిపోయాడు!

అతన్నీ... అతని శవాన్నీ కన బడకుండా 'పేక్' చేసి పారేసింది ఉదారంగు కల... వేలమంది అతన్ని చుట్టుముట్టి పట్టేశారు తేనెటీగల్లా...

అపరిచితంగాఅతన్నలా దాచిపెట్టి నన్ను గెంటేసింది ఉదారంగు కల!